# 'వుద్ధరిణి'

(మినీ కథ)

వి. కె. విశ్వనాథ శర్మ

"నువ్వొట్టి సోర్దపరుడివయ్యా!"

"అలాటి వాణ్ణయితే నీ వూసెత్తే వాణ్ణి కాదు."

"మరి నువ్వు సేసిందేంటయ్యా! నేను బికారి ఎదవనని పదిమందికీ సూపించావ్. నన్ను డబ్బునోళ్ళు పెత్తందార్లు సితగ్గొట్టారన్నావ్. నా బార్య బిడల్ని సౌనుతైనారని బజార్నెట్టావ్. ఆ లి .. ఆకలి అని అరిసే అనాకారులుగా, అమాయకులుగా చేసావ్. ...."

"నిన్ను కించ పరచాలని కాదు. పదిమందీ నీ మీద జాలి పడాలనే చేసాను."

"ఎందుకయ్యా? అంత తెలివిగా తప్పుకుంటావ్? ముందు నీ కసలు జాలేసిందా?"

"మళ్ళీ మొదటి కొస్తున్నావ్ పద్దయ్యా! నిన్ను చూసి నా గుండె కరగబట్టే ..."

"నీకే కాదయ్యా! నన్ను సూసి నోళ్ళు కందరికీ గుండె కరుగుద్ది. కళ్ళు కాలవలౌతయ్ మరి ఆదుకుందెవురు? నా గోసీ గుడ్డను మార్సిందెవురు? నా బార్యా బిడ్డల ఆకలి తీర్సిందెవురు? మాటల్లో మురిపించటమేగదయ్యా అందరికీ సేతయింది?"

"పద్దయ్యా! నువ్వు అతిగా వాగుతున్నావ్. ఏదో అట్టడుగున అలమటించి పోతున్నావని దయ తలిస్తే ఇష్టమొచ్చినట్లు కూస్తున్నావా? అసలు మీరు అలానే చావాలి. మిమ్మల్ని వుద్ధరించమని లోకానికి చెబటం నాదే తప్పు."

"హు! వుద్ధరింపు! ... ఎక్కడ నేర్సావయ్యా ఆ మాట. ఎవురు నేర్పె రయ్యా! ఔన్లే .... సదువుకున్నాడివి. సమాజసేవ సేస్తున్నోడివి. నాఐోటోళ్ళ కదల్ని ఒకటికి పది కల్పించి రాసి డబ్బు సేసుకుంటున్నావ్. నా పొట్ట ఎండిపోయిందని లోకానికి సెబుతూ నీ పొట్ట నింపుకుంటన్నావ్. నా బోటోడికి పైసా దరమం సెయ్యలేనోడివి, నా కద కన్నీటి కదగా సెప్పిపది మందినీ దరమం సెయ్యండని సెబుతావ్. బావుందయ్యా నీ వుద్ధరింపు."

పేలవంగా నవ్వేడు పద్దయ్య.

"పద్దయ్యా! ..." తన వ్యక్తిత్వానికి జల్లెడ తూట్లు పొడుస్తున్న 'పద్దయ్య పాత్ర' మీద కోపంగా, వెర్రిగా అరిచాడు ప్రఖ్యాత కథా రచయిత పరశురామయ్య. ఆతని కలం పేరు 'వుద్ధరిణి.'

---

యీశ్వరుడంటారు 'నువ్వు గొప్ప శాంతిలో వున్నావు – ఆ సంగతి గుర్తించగల శక్తి ఇంకా నీ మనసుకి లేదు" అని.

ఐనా, కోడి కూరలేని శాంతి అదేం శాంతండీ! ఎవరన్నా నవ్వుతారు. పోనీ ఆవకాయ ఐనా లేదు. ఎందుకంటే ఆవకాయలేని స్వర్గం! .... (వుట 287)

మాట్లాడకు. ఆలోచించకు. చెయ్యకు, కాని మాట్లాడకండా, చెయ్యకండా, ఆలోచించకండా వుండాలని ప్రయత్నం చెయ్యకు – అగిపో మాటల్నీ, ఆలోచనల్నీ వాటి ఇష్టం ఒచ్చినట్లు జరగనీ. నువ్వు చెయ్యకు. చెయ్యనని కూచోకు, మాట్లాడకు, మాట్లాడననకు, నువ్వు నీగా ఆలోచించకు. ఆలోచనల్ని వాటి దోవన వాటిని పోనీ.

అదీ భగవాన్ వేదాంతం! (వుట 81) – 'మహాస్థాన్‌లో' చలం